నిలువెత్తు నిర్లక్ష్యం

వార్డుల్లో రహదారులు, కాలువలు, గెడ్డలు పరిశుభ్రం చేయమని చెబుతూ.. ప్రజల అవసరాల కోసం నూతన చేతిబోర్లు వేయించటం.. సదుపాయాలు కల్పించటం వంటి అభివృద్ధి పనులు చేయించే జీవీఎంసీ వార్డు ఇన్‌స్పెక్టర్, ఇతర ఉద్యోగులు పని చేసుకునే కార్యాలయం పూర్తిగా శిథిలమై నేడో రేపో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్నా ఉన్నతాధికారులు కనీస చర్యలు తీసుకోలేదు. ఎప్పుడు కూలిపోతుందో తెలియని ఆ శిథిల భవనంలో పని చేసేందుకు భయపడి ఇన్‌స్పెక్టర్, ఇతర ఉద్యోగులు ఆ శిథిల భవనం బయట తమ పనులు చేసుకుంటున్నారు. వ్యక్తిగత పనులపై వార్డు కార్యాలయానికి వచ్చే స్థానికులు కూడా భయపెడుతున్న ఆ కార్యాలయ భవనాన్ని చూసి వణికిపోతున్నారు.



శిథిల భవనంలోనే నిర్వహిస్తున్న వార్డు కార్యాలయం

జగదాంబ: గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ అంటేనే అభివృద్ధి. కానీ కార్పొరేషన్‌లో భాగమైన కొన్ని వార్డు కార్యాలయాల దుస్థితిని చూస్తే ఆవేదన కలుగుతుంది. అటువంటిదే జీవీఎంసీ జోన్–4 పరిధి 39వ వార్డులో గల వార్డు కార్యాలయం. ఇది శిథిలమై దీన స్థితికి చేరింది. ఏళ్ల నాటి భవనంలోనే ఉద్యోగులు విధులు నిర్వర్తిస్తున్నారు. ఎప్పుడు కూలిపోతుందోనన్న భయంతో కాలం వెళ్లదీస్తున్నారు. వర్షాకాలం.. ఆపై వరుస తుపాన్ల నేపథ్యంలో భవనం కారిపోవడంతో పాటు శ్లాబ్ పెచ్చులూడిపోతూ భయం కలిగిస్తోంది. దీంతో కార్యాలయంలో ఉండే శానిటరీ ఇన్‌స్పెక్టర్, ఉద్యోగులు, సెక్రటరీలు భవనం లోపల రికార్డులుంచి వారు మాత్రం బయట కూర్చునో లేదా నిలబడో విధులు నిర్వహించుకుంటున్నారంటే ఆ భవనం ఎంతలా భయపెడుతుందో అర్థం చేసుకోవచ్చు. దీని వల్ల ఇక్కడికి వచ్చే ప్రజలు కూడా భయపడుతున్నారు.

- కూలేందుకు సిద్ధంగా జీవీఎంసీ 39వ వార్డు కార్యాలయం
- వర్షాలకు కారి.. శ్లాబ్ పెచ్చులూడిపోతున్న వైనం
- భయంతో కార్యాలయం వెలుపలే ఉద్యోగుల విధుల నిర్వహణ

దీన స్థితిలో వార్డు కార్యాలయం..

వార్డు కార్యాలయం అంటే ఆ వార్డులో జరిగే అన్ని కార్యక్రమాలకు కేంద్రం. అయితే ఈ వార్డు కార్యాలయాన్ని చూస్తే అధికారుల నిర్లక్ష్యం కనబడుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇక్కడి వార్డు ఇన్‌స్పెక్టర్ పని చేసుకోవడానికి ఉన్న బల్ల, కుర్చీ పాత కాలం నాటివి. అలాగే కార్యాలయం రికార్డులు దాచే ఇనుప బీరువా అయితే మరీ దారుణం. తుప్పుపట్టి కనీసం తాళం కూడా వేసుకునే అవకాశం లేకుండా ఉంది. ట్రేడ్ లైసెన్స్ కోసం ఎవరైనా వ్యాపారి వస్తే కనీసం కూర్చోవడానికి కుర్చీ కూడా లేదంటే ఈ కార్యాలయం ఎంత హీనస్థితిలో ఉందో అర్థం చేసుకోవచ్చని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీని వల్ల వార్డు ఇన్‌స్పెక్టర్ బయటే మాట్లాడి పంపించాల్సి వస్తుందని అంటున్నారు. వార్డుల్లో రహదారులు, కాలువలు, గెడ్డలు పరిశుభ్రం చేయమని చెబుతున్నారు తప్ప వార్డు కార్యాలయాన్ని పునర్నిర్మించేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవడంలేదని ఆరోపణలు వస్తున్నాయి. ఇప్పటికైనా జీవీఎంసీ అధికారులు స్పందించి కొత్తగా వార్డు కార్యాలయం నిర్మించాలని 39వ వార్డు ప్రజలు కోరుతున్నారు.



భవనంలో ఊడిపోతున్న శ్లాబ్ పెచ్చులు

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబ అమ్మవారికి ప్రత్యేక హారతులు ఇస్తున్న అర్చకులు శ్రీకాంత్‌శర్మ

కంచరపాలెం: జ్ఞానాపురం కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆషాఢ శుద్ధ అష్టమి ఆదివారాన్ని పురస్కరించుకుని భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్ బాబా ఆధ్వర్యంలో ఆలయ పూజారమ్మ వాసుపల్లి విజయమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలకంరించారు. ఆలయ అర్చకులు పులఖండం శ్రీకాంత్‌శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ. 10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు. ఆలయ సిబ్బంది రామకృష్ణ నేతృత్వంలో స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

న్యాయం చేయాలని కార్మికుల మొర

మహారాణిపేట: తమను ఇబ్బందులకు గురి చేస్తున్న సంస్థపై చర్యలు తీసుకోవాలని కార్మికులు కోరారు. సెంట్రల్ ఫార్మసీలో జాబ్ మేళా ద్వారా రెడ్డి ఫౌండేషన్‌లో ఉద్యోగంలో చేరిన తమను గత రెండు సంవత్సరాలుగా అనేక రకాల ఇబ్బందులకు గురి చేస్తున్నారని, దీనిపై జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని న్యాయం చేయాలని కోరారు. తమకు న్యాయం జరగపోతే మళ్లీ ఆందోళనకు దిగుతామని, కలెక్టర్‌ను కూడా కలిసి తమకు న్యాయం చేయమని కోరుతామని ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. కార్మికుల పదో తరగతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తున్నట్లు తెలిపారు. సంస్థ వేధింపులు భరించలేక దాదాపు 80 మందికి పైగా బయటకు వచ్చేశారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరారు.

ఆర్యవైశ్య యువజన సంఘం నూతన కార్యవర్గం

దాబాగార్డెన్స్: ఆర్యవైశ్య యువజన సంఘం 48వ వార్షిక సమావేశం ఆదివారం పాతనగరం వాసవీ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. దుర్గా సోమేశ్వరరావు అధ్యక్షుడిగా, కె. రామారావు కార్యదర్శిగా, పీవీఎస్ఎస్‌వీ సాంబమూర్తి కోశాధికారిగా సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా సంఘ పూర్వ అధ్యక్షుడు గ్రంధి రామకృష్ణారావు వ్యవహరించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి



వృద్ధురాలి మృతదేహం

తాటిచెట్లపాలెం : రైలులో అపస్మారక స్థితిలో ఉన్న వృద్ధురాలు కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మరణించినట్లు విశాఖపట్నం గవర్నమెంట్ రైల్వే పోలీసులు తెలిపారు. వివరాలిలా.. ఈ నెల 13న లోకమాన్య తిలక్ ఎక్స్‌ప్రెస్ విశాఖపట్నం చేరుకున్న అనంతరం రైలును నిర్వహణ పనుల నిమిత్తం న్యూ కోచింగ్ కాంప్లెక్స్‌కు తరలించారు. రైలు నిర్వహణ పనులు చేపడుతున్న సమయంలో జనరల్ కోచ్‌లో సుమారు 60 ఏళ్ల వృద్ధురాలు అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని క్లీనింగ్ సిబ్బంది, రైల్వే భద్రతా దళ సిబ్బంది గుర్తించి, వెంటనే చికిత్స నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అప్పటి నుంచి చికిత్స పొందుతున్న ఈ వృద్ధురాలు శనివారం రాత్రి మృతిచెందింది. ఈ మహిళకు సంబంధించి ఏ విధమైన ఆధారాలు లభ్యం కాలేదని, ఈమె సుమారు 5 అడుగుల ఎత్తు, పసుపు, నలుపు రంగులు గల నైటీ ధరించి, చామనచాయలో ఉందని జీఆర్పీ సిబ్బంది తెలపారు. ఈమె గురించి ఎవరికైనా తెలిస్తే విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లోని రైల్వే పోలీసులకు గానీ, 96661 22722, 94406 27547 నంబర్లలో గానీ తెలియజేయాలని జీఆర్పీ ఎస్ఐ వి.బాలాజీరావు కోరారు.

ఉత్సాహంగా ఆటల పోటీలు



పోటీల్లో పాల్గొన్న చిన్నారులు

దాబాగార్డెన్స్: బాల్యం ఎంతో మధురమైనదని, ఆ దశలోనే వారంతా క్రీడల్లో పాల్గొంటే ఉల్లాసంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని ఎస్ఐబీవోజీ వ్యవస్థాపకుడు దుర్గాప్రసాద్, పీత్రమ్ స్పష్టం చేశారు. దాబాగార్డెన్స్‌లో గల చిల్డ్రన్స్ ఫేజ్–3 ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం న్యూ ఇండియా ఒలింపిక్ బేబీ గేమ్స్–2024 ఆటల పోటీలు నిర్వహించారు. పోటీల్లో పలువురు చిన్నారులు బుడి బుడి అడుగులతో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు మాట్లాడుతూ బాల్యం నుంచే ఆట పోటీల్లో చిన్నారులు పాల్గొనడం ద్వారా వారిలో భయాందోళనలు పోతాయన్నారు. తద్వారా క్రీడల్లో పాల్గొనేందుకు ఉత్సాహం చూపుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీలో నిలిచిన చిన్నారులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శివ, పి. నిరుపమ, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పాత్రపల్లి రాజారావుకు ఘన నివాళి



రాజారావు చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ, శ్రీధర్ తదితరులు

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ వార్డు యూత్ కన్వీనర్ పాత్రపల్లి సునీల్‌కుమార్ యాదవ్ తండ్రి పాత్రపల్లి రాజారావుకు ఆదివారం జ్ఞానాపురం సెయింట్ పీటర్స్ కమ్యూనిటీ హాల్లో జీవీఎంసీ 41వ వార్డు కార్పొరేటర్, స్టాండింగ్ కమిటీ సభ్యురాలు కోడిగుడ్ల పూర్ణిమ, వైఎస్సార్‌సీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కోడిగుడ్ల పూర్ణిమ మాట్లాడుతూ రాజారావు ప్రేమ, ఆప్యాయతలకు మారుపేరుగా నిలిచారని, 70 ఏళ్ల వయసులో కూడా ఆయన వైఎస్సార్‌సీపీలో ఉత్సాహంగా పని చేశారని కొనియాడారు. రాజారావు కుటుంబానికి సానుభూతి తెలిపారు.

పింఛన్‌దారుల సమస్యలపై ప్రత్యేక దృష్టి



సమాచార శాఖ విశ్రాంత డివిజనల్ అధికారి సాయిబాబాను సత్కరిస్తున్న అధికారులు

మహారాణిపేట: రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగుల పింఛన్లలో తలెత్తే సమస్యలు పరిష్కరించేందుకు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నట్లు రాష్ట్ర ట్రెజరీ అకౌంట్స్ డైరెక్టర్ ఎం. మోహన్‌రావు తెలిపారు. ఆదివారం కలెక్టర్ కార్యాలయం వద్ద ఉన్న ప్రభుత్వ పింఛనుదారుల సంఘ కార్యాలయంలో సమాచార శాఖ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సదస్సులో మాట్లాడారు. పింఛన్‌దారులు సర్వీసు పింఛను, కుటుంబ పింఛనుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రాయింగ్ అధికారి, ఎస్టాబ్లిష్‌మెంట్ గుమస్తా నిబద్ధతతో పింఛను పేపర్లు పంపించవలసి ఉంటుందన్నారు. ఉద్యోగి మరణ ధ్రువపత్రం, సరైన రీతిలో వివరాలు ఉంటే వెంటనే పింఛన్ మంజూరు అవుతుందన్నారు. అధ్యక్షుడు ఆర్. త్యాగరాజు మాట్లాడుతూ పింఛన్ ఫారాలు సక్రమంగా పూర్తి చేసి పంపాలన్నారు. సమాచార శాఖ ఆర్‌జేడీ వి.మణిరామ్, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పి.గోవిందరావు తదితరులు మాట్లాడారు. అనంతరం పలువురు విశ్రాంత ఉద్యోగులను సత్కరించారు. నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది. పెన్షనర్ల సంఘం నాయకులు డీడీ ప్రసాదరావు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

‘చిన్నోడికి ప్రేమతో’ పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ చలం తదితరులు

దాబాగార్డెన్స్: తల్లిదండ్రులంతా చదవాల్సిన పుస్తకం ‘చిన్నోడికి ప్రేమతో’ అని ద్రవిడ యూనివర్సిటీ పూర్వ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కేఎస్ చలం పేర్కొన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఆదివారం విద్యావంతుల ఆత్మీయ సమ్మేళనంలో ఈ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యంలో ప్రతి బిడ్డకి ఇటువంటి అనుభవం అవసరమన్నారు. పుస్తక రచయిత డాక్టర్ విజయలక్ష్మి దూరంగా ఉన్న తన బిడ్డకు తాను రాసిన ఈ ఉత్తరాలన్నీ బహుమతిగా ఇచ్చిన తర్వాత అనేక మంది చూసి ఇది పబ్లిష్ చేస్తే బాగుంటుందనే కోరిక మేరకు ప్రచురించామన్నారు. కార్యక్రమంలో విద్యా రంగంలో బాలల సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్న ఎస్ఎస్ఆర్ జగన్నాథరావు, పి. మురళీకృష్ణ, సివిల్ సర్వెంట్ ఈదర రవికిరణ్, సుధ, శ్రీనాథ్, డాక్టర్ జోన్, బుద్ధ శ్రీనివాస్, నరవ ప్రకాశరావు, రవికిరణ్, చంద్రశేఖర్, సునీల్‌రెడ్డి, డాక్టర్ పద్మ, కన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర విభజనతో వనరులు కోల్పోయిన ఏపీ



మాట్లాడుతున్న డాక్టర్ రమేష్

దాబాగార్డెన్స్: రాష్ట్ర విభజన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వనరులు కోల్పోయిందని రిటైర్డ్ ఐఏఎస్, పూర్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ డాక్టర్ పీవీ రమేష్ అన్నారు. జనచైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ‘ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి–తక్షణ కర్తవ్యాల’పై ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 58 శాతం జనాభాతో 46 శాతం మాత్రమే ఆదాయాన్ని పొందామన్నారు. 42 శాతం జనాభా గల తెలంగాణ 54 శాతం ఆదాయాన్ని పొందిందని చెప్పారు. అభివృద్ధికి కేంద్రమైన హైదరాబాద్‌ను కోల్పోయామన్నారు. వీటి ఫలితంగా ఆంధ్రప్రదేశ్ దక్షిణాది రాష్ట్రాల్లో అతి తక్కువ తలసరి ఆదాయం గల రాష్ట్రంగా మారిందన్నారు. దక్షిణాది రాష్ట్రాల్లో అతి తక్కువ పట్టణీకరణ జరిగిన రాష్ట్రంగా ఉందని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ రైతుల్లో గందరగోళ పరిస్థితి కల్పించిందని, ఫలితంగా భూకబ్జాలు, ఆక్రమణకు అవకాశం వచ్చిందన్నారు. జన చైతన్య వేదిక అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులు రాష్ట్రానికి రప్పించుకోవాలని, ఆయా ప్రాజెక్టులకు కావల్సిన భూమి, నగదు వాటాను చెల్లించి ప్రాజెక్టులు, స్కీంలు రాష్ట్రానికి తెప్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో దూర విద్యా కేంద్రం పూర్వ డైరెక్టర్ ప్రొఫెసర్ పి. హరి ప్రకాష్, పూర్వ వైస్ చాన్స్‌లర్స్ ఆర్. సుదర్శనరావు, ఎస్. రామకృష్ణారావు, ప్రొఫెసర్ అవధాని, ప్రొఫెసర్ మురళీకృష్ణ, ప్రొఫెసర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ గంగారామ్, మరుపిల్ల పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

‘శ్రీమద్రామాయణం’ వ్యాస సంపుటి ఆవిష్కరణ



గరికిపాటి నరసింహారావుకు పుస్తకాన్ని అందిస్తున్న ఆవిష్కర్త అప్పాజోస్యుల సత్యనారాయణ

సీతంపేట: వాల్మీకి రామాయణంలో రాముడు సాధారణ మానవుడని, విశ్వనాథ వారి రామాలయలో రాముడు సాక్షాత్తు పరమేశ్వర స్వరూపుడని ఆచార్య అప్పాజోస్యుల సత్యనారాయణ అన్నారు. విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగిన సభలో ‘శ్రీమద్రామాయణ కల్పవృక్షము, ఉదాత్త కల్పనలు’ వ్యాస సంపుటిని ముఖ్య అతిథిగా ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఆచార్య బేతవోలు రామబ్రహ్మం సంపాదకులుగా, బాలకాండపై వ్యాసం రాయగా, ఐదుగురు గొప్ప సాహితీవేత్తలు అద్దంకి శ్రీనివాస్, పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, బులుసు వెంకటేశ్వర్లు, కడిమిళ్ల వరప్రసాద్, పేరి రవికుమార్ ఐదు కాండాలకు వ్యాసాలు రాయడం, అటువంటి గొప్ప వ్యాస సంపుటి ఆవిష్కరణకు అవకాశం కల్పించడం అంతా రాముని దయగా పేర్కొన్నారు. తొలి ప్రతిని విశ్వనాథ మనువడు విశ్వనాథ సత్యనారాయణకు అందజేశారు. సభకు విశిష్ట అతిథిగా విచ్చేసిన గరికిపాటి నరసింహారావుకు మరో ప్రతిని అందించారు. సభాధ్యక్షుడు డాక్టర్ జి.రఘురామారావు మాట్లాడుతూ రామాయణంపై విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యంలో వరుసగా మూడు కార్యక్రమాలు నిర్వహించే అవకాశం రాముని వల్లే లభించిందన్నారు.

అలరించిన స్టోరీ టెల్లింగ్



పిల్లలకు కథ చెబుతున్న సీతా శ్రీనివాస్

సీతంపేట: ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన మియావాకీ స్టోరీ టెల్లింగ్ పిల్లలను అలరించింది. కథకురాలు సీతా శ్రీనివాస్ తనదైన శైలిలో కథలు చెప్పి చిన్నారుల్లో ఊహ, సృజనాత్మకత కలిగించారు. జూ డక్, టైస్ అండ్ ది ఫార్ అవే మౌంటైన్ కథలు చెప్పే విధానం ఆసక్తికరంగా సాగింది. పిల్లలు కథలు వినడంతోపాటు కథలకు సంబంధించిన ఆటపాటల్లో నిమగ్నమయ్యారు. యాక్టివిటీలో భాగంగా పాటలు పాడటం, హ్యాండ్ ఆన్ యాక్టివిటీలు, బెలూన్ బ్లోయింగ్‌లో పిల్లలు చురుగ్గా పాల్గొన్నారు. కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన 60 మంది చిన్నారులు పాల్గొన్నారు.

తీరు మార్చుకోని వ్యాపారులు

జీవీఎంసీ 35వ వార్డులో ఎక్కడి చెత్త అక్కడే



రహదారిపై కలప, చెత్త

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వ్యాపారుల తీరు మారకపోవడంతో ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. వార్డులో జీఎస్ఎన్ రహదారిలో స్క్రాప్, టింబర్ డిపోల వ్యాపారుల తీరు మారకపోవడంతో దోమలు, పాములతో ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆరోపిస్తున్నారు. వ్యాపారులు రహదారి పక్కనే చెత్త వేసి వదిలేయడంతో ఆ ప్రాంతమంతా వర్షాల కారణంగా దోమలు వృద్ధి చెందుతున్నాయని, మరోపక్క పాములకు నిలయంగా మారిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇటీవల సాక్షిలో వ్యర్థం..అనర్థం పేరిట కథనం వెలువడడంతో అధికారులు పరుగులు తీసి క్లియర్ చేసినట్లు చూపించారు. కానీ వాస్తవానికి ఎక్కడి చెత్త అక్కడే ఉండడంతో మళ్లీ అవే బాధలని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా జీవీఎంసీ ఉన్నతాధికారులు స్పందించి రహదారిపై చెత్త తీయించి పరిశుభ్రం చేయాలని జీఎస్ఎస్ శాస్త్రి రోడ్డు ప్రజలు కోరుతున్నారు.

విదేశాల్లో ఎంబీబీఎస్ విద్యపై తస్మాత్ జాగ్రత్త



సూచనలిస్తున్న ఈ వింగ్స్ డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్

దాబాగార్డెన్స్: విదేశాల్లో ఎంబీబీఎస్ చదవాలనుకునే వారు జాగ్రత్తగా ఉండాలని ఈవింగ్స్ అబ్రాడ్ ఎడ్యుకేషనల్ కన్సల్టెన్సీ డైరెక్టర్లు రామకృష్ణ, శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పలువురు విద్యార్థులకు సూచనలు చేశారు. ప్రతి సంవత్సరం రెండు తెలుగు రాష్ట్రాల నుంచి 15 వేలకు పైగా విద్యార్థులు ఎంబీబీఎస్ చదువుకోవడానికి విదేశాలకు వెళ్తున్నారని చెప్పారు. గతంలో విదేశాల్లో ఎంబీబీఎస్ పూర్తి చేసి ఇక్కడ ఎఫ్ఎంజీఈ పరీక్షల్లో ఉత్తీర్ణత అయితే డాక్టర్ లైసెన్స్ ఇచ్చేవారని, కానీ ప్రస్తుతం అనేక నిబంధలు వచ్చాయన్నారు. ఎన్ఎంసీ రూల్స్ పాటించే దేశాల్లో చదివితేనే ఇండియాలో ఎంబీబీఎస్ డిగ్రీ చెల్లుబాటు అవుతుందని వివరించారు. అలా కాకపోతే సమయం, డబ్బు వృథా అవుతాయని చెప్పారు. ఏ దేశాల్లో చదివితే ఎంబీబీఎస్ డిగ్రీ ఇండియాలో చెల్లుబాటు అవుతుందో తెలుసుకోవాలంటే 8806688068 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఉక్కు దీక్షకు సంఘీభావం



దీక్షలో పాల్గొన్న సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద జరుగుతున్న దీక్షకు ఆదివారం డిఫెన్స్ కో–ఆర్డినేషన్ కమిటీ ఆధ్వర్యంలో సివిలియన్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా నాయకుడు బానోజీ బిల్లా మాట్లాడుతూ ఎంతో మంది త్యాగాల ఫలితంగా స్టీల్‌ప్లాంట్ వచ్చిందన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు వెన్నుదన్నుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కారు చౌకగా అమ్మడాన్ని ప్రజలందరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్ దగ్గరికి వస్తే తరిమికొడతామని, ప్లాంట్‌కు ఎవరు వచ్చినా అడ్డుకుంటామని అన్నారు. ఉక్కు పరిశ్రమను లాభాల బాటలోకి తీసుకురావడానికి కార్మికులు కష్టపడి పని చేస్తుంటే ప్రభుత్వం, యాజమాన్యం కలిసి బొగ్గు కొరత సృష్టించారన్నారు. ఉత్పత్తికి ఆటంకం కలిగించడం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో కో–ఆపరేటివ్ డైరెక్టర్ మీసాల సురేష్, షాప్ కమిటీ మెంబర్ వినీష్, సూరప్పుడు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శాంతి స్థాపనకు కృషి చేయాలి



మాట్లాడుతున్న ఆచార్య బాల మోహన్‌దాస్

దాబాగార్డెన్స్: పాలస్తీనా, ఇజ్రాయిల్ యుద్ధం సమసిపోవడానికి ఐక్య రాజ్యసమితి గట్టి ప్రయత్నం చేయాలని, వీటో దేశాలను నియంత్రించాలని ఇస్కఫ్ రాష్ట్ర కార్యదర్శి రాజశేఖర్ అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఇస్కఫ్, గ్లోబల్ నెట్‌వర్క్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన పాలస్తీనాకు సంఘీభావ సదస్సులో ఆయన మాట్లాడారు. ఇజ్రాయిల్ దాడుల వల్ల అక్కడి ప్రజల జీవన విధానం ఛిద్రమైందన్నారు. ఆస్పత్రులను సైతం నేలమట్టం చేయడంతో యుద్ధ ఖైదీలు, పిల్లలు మృత్యువాత పడతున్నారన్నారు. ఆచార్య బాల మోహన్‌దాస్ మాట్లాడుతూ ఇజ్రాయిల్ స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నాక ఉద్రిక్త పరిస్థితి నెలకొందని, గాజాను ఆక్రమించి యుద్ధ వాతావరణం నెలకొందన్నారు. పాలస్తీనా గతంలో భారతదేశం మద్దతు కోరిందని, అయితే ఇటీవల ఇజ్రాయిల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించాక పరిస్థితులు మారాయన్నారు. కార్యక్రమంలో ఇస్కఫ్ జిల్లా అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి మరుపల్లి పైడిరాజు, దేవా, సుకుమారన్, శ్యామ్‌సుందర్, మణి తదితరులు పాల్గొన్నారు.

విశాఖ మ్యూజిక్ అకాడమీ నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గ సభ్యులు

దాబాగార్డెన్స్ : విశాఖ మ్యూజిక్ అకాడమీ 52వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం నగరంలోని ఓ హోటల్లో జరిగింది. అకాడమీ సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధిక సంఖ్యలో పాల్గొన్న అకాడమీ సభ్యుల బృందం, సంగీత ప్రపంచానికి, ప్రత్యేకంగా విశాఖ మ్యూజిక్ అకాడమీకి అత్యధిక కాలం ఎనలేని సేవలందించి పదవీ విరమణ గావించిన అకాడమీ అధ్యక్షుడు డాక్టర్ ఎస్వీ రంగరాజన్, నాలుగు దశాబ్దాల పాటు సంగీత ప్రపంచంలో పేరు నిలబెట్టుకుంటూ అనన్య సామాన్యమైన సేవలందించిన కార్యదర్శి ఎమ్మెస్ శ్రీనివాస్‌ను సభ్యులు కొనియాడారు. అనంతరం నిర్వహించిన ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రముఖ న్యాయవాది, సంగీత ప్రియుడు కేవీ రామ్మూర్తిని అధ్యక్షుడిగా, ప్రముఖ చార్టర్డ్ అకౌంటెంట్ వీరఘంట చంద్రశేఖర్‌ను కార్యదర్శిగా, ప్రముఖ న్యాయవాది బీపీ రాజారావు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ పేరాల బాలమురళీకృష్ణను ఉపాధ్యక్షులుగా, కోశాధికారిగా సీహెచ్ దుర్గాప్రసాద్, సహ కార్యదర్శులుగా భుజంగరావు, ఎం. జ్వాలాప్రసాద్‌ను సభ్యులు ఎన్నుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నూతన అధ్యక్షుడు కేవీ రామ్మూర్తి మాట్లాడుతూ నూతన కార్యవర్గం శక్తివంచన లేకుండా అకాడమీకి సేవలందించే ప్రయత్నం చేస్తుందన్నారు.

రక్తదాన శిబిరానికి చక్కని స్పందన



రక్తదానం చేస్తున్న యువత

సీతంపేట: వాయుపుత్ర హెల్త్ క్లబ్ 30వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. రామాటాకీస్ వద్ద క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో 43 మంది రక్తదానం చేశారు. ముఖ్య అతిథి కలివరపు దాలిరాజు శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కరోనా తర్వాత రక్తం కొరతతో బ్లడ్ బ్యాంకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ఆంధ్రా బాడీ లిఫ్టింగ్ సంఘం అధ్యక్షుడు ఎస్.ఎస్.శివశంకర్ మాట్లాడుతూ 30 ఏళ్లుగా జిమ్ నిర్వహిస్తూ ఎందరినో ఆరోగ్య పథంలో నడిపిస్తున్న జిమ్ నిర్వాహకుడు కిలాని గణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో లైవ్‌షేర్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ ప్రమోద్, అరుణ, యడ్ల లక్ష్మణ్‌రెడ్డి, ఎస్. కిరణ్‌కుమార్, కాకి యేసుకుమార్, తమ్మారెడ్డి, టి.సతీష్‌కుమార్ పాల్గొన్నారు.